# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. సిక్కిం ఆకస్మిక వరదల్లో చిక్కుకుపోయిన 3 వేల మందికి పైగా పర్యాటకులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.**

**2. రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ – ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రాజెక్టుకు ఒక వెయ్యి 747 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.**

**3. విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్ళ రాకపోకల్లో మార్పు చేసారు.**

**4. భారత వైమానిక దళం 91వ ఆవిర్భావ దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నాం.**

**5. ఐసీసీ వరల్డ్ కప్‌లో భాగంగా భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్ మరికాసేపట్లో చెన్నైలో ప్రారంభమవుతుంది.**

==========================

ఆకస్మిక వరదల కారణంగా సిక్కిం రాష్ట్రం మంగన్ జిల్లాలో చిక్కుకుపోయిన 3వేలమందికి పైగా పర్యాటకులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వారిని తరలించే ప్రయత్నాలు ప్రతికూల వాతావరణం వల్ల విఫలమయ్యాయి. ఆ ప్రాంతానికి చేరుకునే రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. చుంగ్‌తాంగ్ పట్టణ ప్రాంతంలో ఆశ్రయం పొందిన వారికి తీస్తా ఊర్జా పవర్ ప్రాజెక్టు అత్యవసర వస్తువులు సరఫరా చేస్తోంది. వారికి సహాయం చేయడానికి ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ దళం సహాయ సహకారాలు అందిస్తోంది. మంగన్ జిల్లాలో వచ్చే 5 రోజులపాటు తేలికపాటి నుంచి ఒకమోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం తెలిపింది. సిక్కిం వరదల్లో నిన్నటికి మృతుల సంఖ్య 30కు చేరింది. వారిలో 8 మంది సైనికులు ఉన్నారు. ఇంకా 14 మంది సైనికుల ఆచూకీ తెలియాల్సి ఉంది.

--------------------------

డిజిటల్ సేవలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్–ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రాజెక్టుకు ఒక వెయ్యి 747 కోట్ల రూపాయల నిధులు ఇవ్వడానికి కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఒక వెయ్యి 145 కోట్ల రూపాయల ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 555 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆపరేటర్లు, ఎంఎస్‌వోలపై ఆర్థికభారం తగ్గించడానికి వారికి ఫైబర్ నెట్ బాక్సులు 9 నెలలు ఉచితంగా అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

--------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల

మండలం గెర్లపల్లిలో మంత్రి ఈరోజు పర్యటించి మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చామని అర్హత ఉండి సంక్షేమ పథకాలు ఇప్పటికే అందనివారిని గుర్తించి వారకి ఎన్నికల లోపు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను నిన్న ఆయన పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, వాహనాల పార్కింగ్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని క్యూలైన్ల ఏర్పాట్లలో మార్పులు చేయాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

---------------------------

దక్షిణ మధ్యరైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో నిర్వహణ పనులు, ట్రాఫిక్ బ్లాక్స్ కారణంగా... విజయవాడ మీదుగా ప్రయాణించే పలు రైళ్ళను రద్దు చేసారు. మరికొన్ని రైళ్ళను పాక్షికంగా రద్దు చేసారు. అలాగే మరికొన్ని రైళ్ళను దారి మళ్ళించారు. ఈ మార్పుల వల్ల విశాఖపట్నం-విజయవాడ-చెన్నై మార్గంలో ప్రయాణించే రైళ్ళ ప్రయాణాలు ప్రభావితమయ్యాయి. రేపటి నుంచి 16వ తేదీ వరకూ 12 రైళ్ళను పూర్తిగా రద్దు చేసారు. 9 రైళ్ళను పాక్షికంగా రద్దు చేసారు. మరికొన్ని రైళ్ళను ఒక్కొక్క రోజు మాత్రం దారి మళ్ళించారు.

---------------------------

భారత గగన తలాన్ని అనునిత్యం కంటికి రెప్పలా కాపలా కాస్తూ... శత్రు కదలికలను నిశితంగా గమనించే భారత వైమానిక దళ 91వ ఆవిర్భావ దినోత్సవం ఈరోజు. 1932 సంవత్సరంలో బ్రిటన్‌కు చెందిన రాయల్ వైమానిక దళానికి మద్దతుగా ఆ ఏడాది 8వ తేదీన భారతీయ వైమానిక దళం ఏర్పాటైంది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే రోజున వైమానిక దళ దినోత్సవం నిర్వహిస్తున్నారు. యుద్ధ సమాయాల్లో శత్రువులపై మెరుపుదాడి చేయడంలో, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను రక్షించడంలోను వాయుసేన అందిస్తున్న సేవలు నిరుపమానమైనవి.

---------------------------

భారత వైమానిక దళం 91వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని బమ్రౌలీ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో పెరేడ్ నిర్వహించారు. ప్రయాగ్‌రాజ్‌లోని ఆర్డినెన్స్ డిపో ఆవరణలో వైమానిక ప్రదర్శన కూడా ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, సెంట్రల్ ఎయిర్ కమాండ్ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ ఎయిర్ మార్షల్ ఆర్‌జీకే కపూర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక... ఇవాళ్టి ఎయిర్‌ఫోర్స్ డే సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వైమానిక దళ సైనికులకు, వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేసారు.

---------------------------

తిరుపతి విమానాశ్రయం సమీపంలో విమానాల మరమత్తు, నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు కెనెడా ఏవియేషన్ కంపెనీ ముందుకొచ్చిందని తిరుపతి పార్లమెంట్ సభ్యులు ఎం.గురుమూర్తి తెలిపారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద కెనెడా ఏవియేషన్ కంపెనీ ప్రతినిధులు విమానాల మరమ్మత్తుల కేంద్రం స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ గురుమూర్తితో తిరుపతిలో ఈరోజు సమావేశమయ్యారు.. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరు నెలల్లో తిరుపతి విమానాశ్రయం వద్ద విమానాల మరమ్మత్తు, నిర్వహణ కేంద్రం ఏర్పాటు అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అభిస్తాయని అన్నారు.

---------------------------

ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రకాశం జిల్లాలో 9లక్షల 9వేల మందిని లబ్దిదారులుగా గుర్తించారు. వారికి జిల్లాలో వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వ వైద్యశాలలతో పాటు 41 నెట్ వర్క్ ఆస్పత్రులను గుర్తించారు. ఆ ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ కింద 1,900 రకాల వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నారు. జిల్లాలో ఆయుష్మాన్ భారత్ లబ్దిదారులు మాట్లాడుతూ, పేద,బడుగు,బలహీన వర్గాలకు ఈ పథకం సంజీవిని వంటిదన్నారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకుని, ఆసక్తి గలవారు శాస్త్రవేత్తలుగా రాణించాలని టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి సదా భార్గవి కోరారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా తిరుపతి గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో నిన్న నిర్వహించిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... టీటీడీలోని 33 విద్యాసంస్థల్లో చదువుతున్న 29 వేల మంది విద్యార్థులు అందరూ శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.

---------------------------

ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ 2023లో భారత్ ఈరోజు మొదటి మ్యాచ్ ఆడనుంది. చెన్నైలో ఈ మధ్యాహ్నం 2 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడతాయి. ఈ టోర్నమెంట్‌కు ముందు జరిగిన వన్డే సీరీస్‌లో భారత్ విజయం సాధించింది. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ కప్‌లోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించాలని భారత్ భావిస్తోంది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

వాయిస్ - 25 సెకన్లు

---------------------------

ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులే కీలక పాత్ర పోషిస్తారని, వారు తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ యం హరినారాయణన్ సూచించారు. నిన్న నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల అధికారులు, సిబ్బందిలో నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 వర్క్ షాప్ లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల ప్రక్రియలో అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు.

---------------------------

ఏలూరు జిల్లాలో నిన్న 25 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 9 వేల 423 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. శర్మిష్ట తెలిపారు. ఏలూరులో డాక్టర్ శర్మిష్ఠ మాట్లాడుతూ... వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి ఉచితంగా మందులు అందించామన్నారు. 107 మందికి మెరుగైన వైద్యం కోసం వేర్వేరు ఆసుపత్రులకు పంపామని చెప్పారు.

---------------------------

వన్యప్రాణులను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని తిరుపతి జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సి సెల్వం పేర్కొన్నారు. తిరుపతిలోని జంతు ప్రదర్శనశాలలో వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎన్నో రకాల వన్యప్రాణులు ఉన్నాయని, వాటిని సంరక్షించే బాధ్యత అధికారులతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు.

======================